# కథ

ఊరి నుంచి తిరిగొచ్చి ఇంట్లోకి అడుగుపెట్టిన రవితో ఆ విషయమెలా చెప్పాలా అని అతని తల్లిదండ్రులు తటపటాయిస్తున్నారు. ఆ మాట రవి చెవినబడితే అతను తట్టుకోలేడని వాళ్లకి తెలుసు. కానీ చెప్పకతప్పింది కాదు.




దివ్యవాణి పరాయి సొమ్మై పోయినా రవి బ్రహ్మచారిగా ఉండి ఆమెనే మనసులో ఆరాధిస్తూ మనసులో ఆరాధిస్తూ జీవితాన్ని వెళ్లబుచ్చు తున్నాడని తన బంధువు లందరికీ తెలిసిన విషయమే.

ఎలాగో మెల్లగానోరు విప్పింది రవితల్లి.

"ఏమిటోరా! ఇలా జరుగుతుందను కోలేదు. అంతా దైవలీల. మన చేతుల్లో ఏముంది. మనం నిమిత్తమాత్రులం" సందేహిస్తూ అంది రవి తల్లి.

"ఏమిటమ్మా, ఏమిటమ్మా, నువ్వనేది?" తల్లివంక ప్రశ్నార్థకంగా చూశాడు రవి.

"అదేరా, పాపం దివ్యవాణి..." చెప్పడం ఆపింది రవి తల్లి. "ఊ ఏమైంది?"

"ఏం చేస్తాం. రెండో భార్య కూడా దక్కే యోగం లేనట్లుందతనికి. భర్తని, సవితి కూతుళ్లిద్దరినీ మోసం చేసింది రా" మెల్లగా అంది రవి తల్లి.

"ఆ"

కెవ్వున కేకపెట్టి నిద్రలోంచి ఉలిక్కిపడి లేచాడు రవి. అది కేవలం కల అని తెలిసి ఒక నిమిషం తరువాత తమాయించుకున్నాడు. దివ్యవాణి అనారోగ్యం గురించి తెలిసి నప్పటి నుంచి రవికి అలాంటి పీడ కలలు రావడం అలవాటై పోయింది. ఆమె అనారోగ్యం గురించి విన్నప్పటి నుంచి రవికి అనుక్షణం గుండె ఆగినంత పనౌతుంది. ఆ వార్త అబద్ధమైతే బాగుండునని పించింది. ఏనాడూ దైవానికి మొక్కని రవి ఒక్కసారిగా ముక్కోటి దేవుళ్లకి పేరు పేరునా వరసనా ప్రార్థించాడు. నాకుపరాయి సొమ్మై పోయినా, ఎక్కడో అక్కడ దివ్యవాణి సుఖంగా వుంటే చాలని దేవుమ్ముందు కూచుని పదే పదే ప్రార్థించాడు రవి.

పదేళ్లు తనని ప్రాణప్రదంగా ప్రేమించి కలలో కూడా ఊహించని విధంగా ఓ రెండో పెళ్లి వాడితో వెళ్లి పోయిన దివ్యవాణికి బ్రెస్ట్ కాన్సరని తెలిసింది రవికి. 'ఇంకెన్నాళ్లు బతుకు తుందో, తాను ఈ లోకాన్ని విడిచివెడితే నా ఒంటరి బ్రతుకు నరక ప్రాయంగా మారదా? ఎప్పుడు ఏ వార్తవింటానో..?" ఒకొక్క ప్రశ్న రవి మనసుని దహిస్తోంది.

దివ్యవాణిని చూడకుండా ఇంకెంత మాత్రం ఉండ లేకపోయాడు రవి. వెంటనే ఊరికి బయలుదేరాడు.

పాత జైలురోడ్డులోకి ఆటో తిరగడంతో రవి గుండె మరింతవేగంగా కొట్టుకో సాగింది. హాస్పిటల్లో అడుగు పెట్టి తనకి పరిచయమున్న డాక్టర్ని కలవడం కోసం ఇంటెన్సివ్ కేర్ యూనిట్లోకి వెళ్లాడు రవి. డాక్టర్ని పలకరించేలోగా తానే "హల్లో రవిగారు! బావున్నారా?" అని రవిని పలకరించాడు డాక్టరు నంద కుమార్.

"నన్నుమీరు బాగా గుర్తుంచుకున్నారు. థాంక్సండీ" అన్నాడు రవి.

"ఏమిటిలా వచ్చారు?" అన్నాడు కుమార్.

"దివ్యవాణి... దివ్యవాణి..." రవి గొంతు బొంగురు పోయింది.

"ఊ దివ్యవాణి...?" ప్రశ్నార్థకంగా చూశాడు కుమార్.

"దివ్యవాణి విషయంతల్చుకుంటుంటే" లోపలి నుంచి పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక పోయాడు రవి. అతనిని మరపించాలని ప్రయత్నించాడు నందకుమార్.

"మీ పిల్లలేం చదువు తున్నారు??" అన్నాడు కుమార్.

"నాకింకా పెళ్లి కాలేదు"

"ఇంకా పెళ్లి కాలేదా" ఆశ్చర్యంగా చూశాడు కుమార్.

"నేను కోలేదు"

"కారణం" కుమార్ ప్రశ్న

"నా మనసులో దివ్యవాణికిచ్చిన స్థానాన్ని మరో స్త్రీకి ఇవ్వ లేక పోతున్నాను" వేదన నిండిన మనసుతో అన్నాడు రవి.

"జీవిత మంతా ఇలానే వుండి పోదలుచుకున్నారా?" సానుభూతిగా అడిగాడు నంద కుమార్.

"పెళ్లిపట్ల, జీవితభాగస్వామి పట్ల నాకొక్కొక్క నిర్దుష్టమైన అభిప్రాయాలు వున్నాయి. నా దృష్టిలో ఇల్లాలంటే మనసులో మనసై బతుకులో బతుకై జీవితంలో జీవన రాగాన్ని పలికించే ఓ ప్రత్యక్ష దేవత. అంతేకాని కేవలం శారీరక వాంఛలను తీర్చే కదిలే యంత్రం కాదు. అందుకే నా హృదయంలో భార్య స్థానంలో మరొకర్ని చూడలేక పోతున్నాను"

"ఒక ఆడదే మిమ్మల్ని ప్రేమించినట్లు నటించి రెండో పెళ్లి వాడితో లేచి పోయినపుడు, మగాడైన మీకెందుకు అర్థం లేని త్యాగం?" అన్నాడు కుమార్.

"ఏ పరిస్థితుల్లో ఆమె నన్ను మోసం చేసిందో గానీ, నేనుమాత్రం మరో స్త్రీని మోసం చేయలేను, మెలకువగా ఉన్నంతసేపేగా ఆమె నన్నుమోసం చేసిన విషయం గుర్తుకు వచ్చేది. అందుకే ఎక్కువ సేపు నిద్రలో గడుపుతున్నాను. నిద్రలో ఆమె నా స్వంతమైందన్న భావనతో జీవితాన్ని గడుపు తున్నాను. ఒకవేళ ఆమెనన్నుబుద్ధిపూర్వకంగా మోసగించినా ఈరోజు బ్రెస్టు కాన్సర్‌తో బాధ పడుతున్న దివ్యవాణి మీద నాకు ప్రేమే గానీ ద్వేషం లేదు" నిచారంగా అన్నాడు రవి.

"బ్రెస్ట్ కేన్సర్?" ఆశ్చర్యంగా చూశాడు రవి.

"అరె మీకు తెలీదా!"

"ఆ! అవునవును. దివ్యవాణికి బ్రెస్ట్ కాన్సర్" రవిని ఓ క్షణం జాలిగా చూసి మళ్లీ తనే మాట్లాడాడు కుమార్.

"రవిగారూ! పురుషుడి కన్న స్త్రీ చాలా సున్నితమైన మనసున్నదని పుస్తకాల్లో చదివాం. కానీ మోసగించిన స్త్రీని ఇంత పిచ్చిగా అభిమానించే మగాణ్ణి ఈరోజు ప్రత్యక్షంగా చూస్తున్నాను. మనసు లేని రాయిగా పుట్టడం దివ్యవాణి అదృష్టం. మనసు చంపు కోలేక మనిషిగా క్షణానికో చావు చావడం మీ దురదృష్టం" విచారం వ్యక్తం చేస్తూ అన్నాడు నంద కుమార్.

"కుమార్ గారూ! మనసిచ్చిన వానికి మనసిచ్చే తత్వం స్త్రీలో వుంటే ప్రపంచ చరిత్ర వేరేలా వుండేది. ద్వేషించే వాడిని ప్రేమించి నంతగా స్త్రీ తనని ప్రేమించే వాడిని ప్రేమించదు. ఇప్పుడు నేను దివ్యవాణి గుణ గణాలు చర్చించ డానికి రాలేదు. కేన్సర్‌తో బాధపడుతున్న దివ్యవాణిని ఒక్కసారి చూసిపోదామని వచ్చాను".

రవి మాటలికి తిరిగి ఏం మాట్లాడాలో తేలిక ఓ క్షణం మౌనంగా వుండి పోయాడు కుమార్. దివ్యవాణి వల్ల మోసపోయి చిక్కిసగమైన రవి ముఖంలో నిరాశా, నిస్పృహ; జీవితమ్మీద విరక్తి స్పష్టమయ్యాయి. ఆడినని కాచిన వెన్నెల్లా వృధా అవుతున్న రవి జీవితాన్ని చూసి కుమార్‌మనసు వికల మైంది.

"రవిగారూ! దివ్యవాణి క్రూరత్వం మీకు తెలీదా? ఆమె తండ్రి బతికున్నంత కాలం కూతురు పెళ్లి చేసుకోవట ల్లేదని కుమిలి పోయాడు. చివరకు మంచం పట్టి కన్నుమూశాడు. ఆయన మరణించిన మరుక్షణం దివ్యవాణి పెళ్లి చేసుకుంది. కనీసం తండ్రికి మనశ్శాంతిని దక్కించని రక్కసి. ఆ రక్కసిని అభిమానిస్తూ మీ బతుకును బలి చేసు కుంటున్నారా?" గుండెలోతుల్లోంచి బరువుగా వచ్చాయి కుమార్‌మాటలు.

"హూ! చేయగలిగేదే ముంది కుమార్ గారు?" యాంత్రికంగా నవ్వాడు రవి.

"ఇంతకీ మీరు భోజనం చేశారా? లేకపోతే మా ఇంటికెరండి" సాదరంగా ఆహ్వానించాడు కుమార్.

"వద్దండీ. దివ్యవాణిని కళ్ళారా చూసే దాకా నాకు ఏమీ సహించదు" బాధగా అన్నాడు రవి.

"సరే మీ ఇష్టం. అది సరే. ఇప్పుడే బంధుత్వంతో దివ్యవాణిని పలక రిస్తారు" అడిగాడు కుమార్.

"మరొకడు కట్టిన తాళిబొట్టు ఆమె మెడలో మెరుస్తుండగా ఆమె ఎదుట పడే ధైర్యం లేదు నాకు. దూరం నుంచి ఆమెను తృప్తిగా చూస్తే చాలు. నా బ్రతు కెలాగూ మోడు వారి పోయింది. కనీసం తానైనా సుఖంగా వుంటే చూడాలనే నా కోరిక" బరు వెక్కిన హృదయంతో అన్నాడు రవి.

కొద్దిసేపాగి మళ్లీ తానే మాట్లాడాడు.

"కుమార్ గారూ! పదేపదే ప్రశ్నిస్తున్నానని ఏమీ అనుకోవద్దు. దివ్యవాణికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందా? చమరు స్తున్న కళ్లని రుమాలుతో ఒత్తుకుంటూ అన్నాడు రవి.

"ఎందుక్కాదండి?" రవిని జాలిగా చూశాడు కుమార్.

"కేన్సరంటే ఎవరికైనా భయమే కదండీ. ఇంతకు ముందు బ్రెస్ట్ కాన్సర్ వచ్చినవాళ్లెవ రైనా తిరగ బడ్డారా?" ఆతృతగా అన్నాడు రవి.

"అహో! దివ్యవాణికేం ఫరవాలేదు. ఆమె తప్పకుండా బతుకు తుంది. సాయంత్రం మీరే చూస్తారుగా" ధైర్యం చెబుతూ అన్నాడు కుమార్.

"ఇంతకీ దివ్యవాణి వైద్యం చేయించు కుంటున్న కేన్సర్‌వార్డెక్కడా?" వేగంగా కొట్టు కుంటున్న గుండెతో మాట తడబడుతూ అన్నాడు రవి.

"ఆమె ఈఆస్పత్రిలో లేదు. దివ్యవాణి వుండే ఆస్పత్రికి సాయంత్రం తీసు కెళ్తాను. అంతవరకు మీరు రాసిన రిసెప్షన్ రూంలో కూర్చోండి. నేనో గంటలో వస్తాను" అని వార్డులోకి వెళ్లి పోయాడు కుమార్.

గతస్మృతులు నెమరు వేసుకుంటూ క్షణం యుగంగా గడిపాడు రవి.సాయంత్రం నాలుగు గంటలైంది. కుమార్‌వచ్చాడు.

"ఏం రవిగారూ! హాస్పిటల్ వెళ్దామా?" అన్నాడు కుమార్.

రవి గుండెల్లో వేడి గుప్పు మంది. గుండె వేగంగా కొట్టుకుంది. కేన్సర్‌తో బాధ పడుతున్న తన హృదయేశ్వరిని చూడగానే గుండెల్లో పొంగే బాధని అదుపులో పెట్టుకో గలనో లలేదో అని సతమత మయ్యాడు.

"వెళ్దాం" నీరసంగా అన్నాడు రవి.

ఇద్దరు హాస్పిటల్ బయటికొచ్చి స్కూటరు ఎక్కారు. స్కూటరు ఉత్తర ఉస్మాన్ రోడ్డుమీదుగా వెళ్లి అక్కడినుంచి హబీబుల్లా రోడ్డులోకి మళ్లింది. అక్కడి నుంచి మరో రెండు వీధులు మారి ఒక పెద్దభవనం ముందు స్కూటరు ఆపాడు కుమార్.

"రవి గారూ! మీరిక్కడే నుంచోండి. స్కూటర్ని ఆ ఎదుటి మేడ దగ్గరున్న మారుతీ కారు పక్కన పెడతాను. స్కూటర్ని చూస్తుండడండి. నేనిప్పుడే వస్తాను" అని ప్రక్క సందులోకి వెళ్లాడు కుమార్

ఒక అరగంట గడిచింది. మేడలోంచి సూటు వేసుకుని పొడవుగా, లావుగా వున్న అందగాడు ఒకదుబూటుల్లచప్పుడు చేసుకుంటూ బయటికి వచ్చాడు. మరో క్షణంలో ఎత్తయిన వక్షమ్మీంచి జారుతున్న పైటని సర్దుకుంటూ వడిగా అడుగులు వేసుకుంటూ వచ్చి కార్లో అతనిపక్కన కూచుంది దివ్యవాణి. ఇది వరకటి కంటేదివ్యవాణి ఇపుడు చాలా అందంగావుంది. బాగా ఒళ్లొచ్చింది. కారు నడిపే ఆ అందగాడు ఆమెభర్తయి వుంటాడని తెలుస్తోంది.

"అంతటి అందగాడు, ధనికుడు కనుకనే దివ్యవాణి లాంటి అందాల రాశి చేయి నందుకో గలిగాడు. ఆమెను జీవిత భాగస్వామిగా చేసు కోవడం నాలాంటి సామాన్యుడి కెలా సాధ్యం! అందుకు జన్మజన్మల పుణ్యఫలం కావాలి" దివ్యవాణి పక్కనున్న అందగాడిని చూసి అనుకున్నాడు రవి. ఇంతలో రవి మెదడులో మెరుపులా ఒక విషయం గుర్తుకు వచ్చింది. ఆ ముందు రోజేదివ్యవాణి భర్త భాగ్యనగరం వెళ్లినట్లు తెలిసింది. 'మరి దివ్యవాణి పక్కనున్న ఆ వ్యక్తినెవరు?"

ఆలోచిస్తుండగా కుమార్‌వచ్చి స్కూటరు తీసుకుని రవిని సమీపించాడు.

"ఏం రవిగారూ? దివ్యవాణిని చూశారుగా? ఇంకేమైనా సందేహాలున్నాయా?"

కుమార్ అలా .అడిగేలోగామరో మారుతీ కారు గేటు దగ్గర ఆగింది. అందులోంచి ఒక వ్యక్తి దిగి మేడలోకి వెళ్లేలోగా మేడలోంచి ఒక అప్సరస వచ్చి కార్లో కూచుంది. కారు కదిలింది. అలాంటి మరి కొన్ని సంఘటనలు చూసే సరికి ఆ భవనం గురించి రవికి వివరంగా అర్థమైంది.

"కుమార్ గారూ! ఇది కేన్సర్ హాస్పిటల్‌లా లేదు. ఇంతకీ దివ్యవాణి ఇక్కడెందుకుంది?" సందేహంగా అన్నాడు రవి.

"ఇంకా అర్థం కాలేదా? రోజుకో చీర మార్చు కున్నంత సులభంగా రోజుకో ప్రియుడ్ని మార్చే దివ్యవాణి అనుకోని పరిస్థితుల్లో నెల తప్పింది. అందుకే అర్జంటుగా ఓ రెండో పెళ్లి వాడి చేతి తాళి కట్టించుకుని ఎబార్షన్ చేయించు కుంది. కాని ప్రియుడిని వదిలించు కున్నంత సులభంగా భర్తను వదిలించు కోలేదుగా! అందుకే కేన్సర్ అనే వంకతో వైద్యం కోసమని భర్తకి దూరంగా వుంటూ ఎప్పటి లాగే తనవిలాస జీవితాన్ని సాగిస్తోంది"

నమ్మలేని నిజాన్ని రవి గుండెలు బద్దలయ్యేలా అన్నాడు కుమార్.

"అంటే దివ్యవాణికి బ్రెస్ట్ కాన్సర్ లేదా?"

"దివ్యవాణికి బ్రెస్ట్ కాన్సర్‌కాదు. మీకు ప్రేమకాన్సర్. దానికి మందు లేదు" అని స్కూటరుస్టార్టు చేశాడు కుమార్.